

# ప్రతి ఇల్లు స్వర్గం కావాలి

"శాంతా! ఇలాగే కూర్చున్నావా! లే! లే! నీకు చెప్పిందేమిటి! నువ్వు చేస్తున్నదేమిటి"

"లేదు! ఒదినా! నేను లేవలేను! నన్ను.... ఇలాగే కూర్చోనీ!"

శాంతా! వాళ్ళ ఒదిన సరళల మాటలు వింటూ అలాగే క్షణం నిలబడి పోయాను.

సరళ ఆ గదిలోంచి వెళ్ళి పోయింది. తలుపు తీసుకుని లోపలికి వెళ్లాను.

'శాంతా!' నా పిలుపుకి తలెత్తి చూసింది శాంత. అందంగా, బొమ్మలా ఉండే శాంత కళ్ళల్లో విషాదం తొణికిసలాడుతోంది. ఆ కళ్ళల్లో చిమ్మిన నీటిని నేను గమనించకపోలేదు.

'రండి' పిలిచింది. మామూలుగా కనపడాలనే ఆఅమ్మాయిప్రయత్నం చూస్తూనే: "ఈవేళ పెళ్ళివారు వస్తున్నారట.... అమ్మగారు కబురుచేశారు" శాంత కొద్దిగా సిగ్గుపడింది. 'అవునండి' అంటూ లేచినిలబడింది. 'కూర్చో! యింకా ఎవరూ రాలేదులే!' అంటూ కూర్చున్నాను.

'నాకీ పెళ్ళి చూపులు నచ్చడంలేదండి! అప్పుడే ఈ నెల్లో యివి రెండోసారి. వచ్చిన ప్రతీవాళ్ళ దగ్గర కూర్చొని వాళ్ళడిగే యక్షప్రశ్నలకి సమాధానమిచ్చే శక్తి నాకు ఇంక లేదు. మీరు దయచేసి ఈవిషయం మా అమ్మగారికి చెప్పెయ్యండి. బి. యిడి. పూర్తికాగానే నేను ఉద్యోగంలో జాయిన్ అవుతాను. అమ్మకీ, నాన్నకీ, ఒదినకీ, అన్నయ్యకీ అందరికీ నచ్చే సంబంధంరాదు. అసలు నాకు నచ్చడం ప్రశ్నకాదు ఈ యింట్లో ...."

శాంతవిసుగుకి అర్థంలేకపోలేదు. రకరకాల సంబంధాలు వెతికితీసుకువస్తాడు

● శ్రీపాద అన్నపూర్ణ

శాంతతండ్రి: శాంతతల్లికి తనఅల్లుడికి ఉండాల్సిన అర్హతలని ఒక పట్టీలా వేసుకున్నట్లు, వచ్చిన ప్రతీ అబ్బాయికీ వంకలు పెట్టేది. ఆవిడకి నచ్చితే అబ్బాయికి నచ్చదు. ఇలా పెళ్ళి చూపులు తతంగం శాంతకి విసుగుని తెచ్చిపెట్టిందేకాని; జీవితంలో రాబోయే సుఖాలకు ఎదురుచూసేలా చేయలేదు. అందుకే శాంత అంత నిస్పృహగా మాట్లాడింది.

'చూడు శాంతా! ఇంతవరకూ వచ్చాక.... ఇపుడు నువ్వు మారాంచేసి మొండితనం చేస్తే; నాన్నగారి మనసు గాయపడుతుంది. అబ్బాయి నీకు నచ్చితే నాకు చెప్పు మీవాళ్ళందరినీ ఒప్పించడానికి ప్రయత్నిస్తాను." అని చెప్పి శాంతను ఒప్పించి కాసేపు కూర్చుని వచ్చేశాను.

శాంతకి ఆతర్వాత ఆ సంబంధమే నిశ్చయమైంది. అందరితో విడివిడిగా మాట్లాడితే ప్రతీ ఒఖ్ఖళ్ళూ విముఖత మాత్రం చూపించలేదు. శాంత తండ్రి పొగుడుతూ మాట్లాడుతూంటే 'అందరం అనుకున్నాం; ఒకరిమాట ఒకరికి పొత్తకే అన్నీఉండి శాంత పెళ్ళి ఆలశ్యమైంది. ఇందులో నేను అంటూ ఎవరం ఏమీ చెయ్యలేదు. శాంత అదృష్టవంతురాలు. అన్నాను.

'శాంతకి పెళ్ళయితే! నువ్వు తీరిగ్గా యిక్కడ కలల్లో తేలిపోతున్నావేమిటి శాంత చెల్లెళ్ళు నన్ను పిలవడానికి వచ్చారు. లే!' అంటున్న మావారి మాటలతో నేను శాంత మీది ఆలోచనలు పక్కకునెట్టి 'వస్తున్నా....కూర్చోండి!' అని వాళ్ళని కూర్చోపెట్టి, రెండు నిమిషాల్లో తెమిలి వాళ్ళింటికి వెళ్ళాను. శాంత పెళ్ళికూతురైంది. నా మనసుకి తృప్తిగా అనిపించింధి. శాంత చిరునవ్వు ఆలాగే నాగుండెల్లో మిగిలిపోయింది.

ఎన్నో కుటుంబాల్లో ఈపెళ్ళి చూపులు—పెళ్ళిగురించి అందరిదీ ఒకమాటగా ఉండక ఎన్నో సమస్యల్ని తెచ్చిపెడుతూ ఉంటుంది. అందరిదీ ఒకమాటగా, ఒకరిని ఒకరు అర్ధంచేసుకుంటూ పెళ్ళిచేసుకోబోయే అమ్మాయి మనసెరిగి పెద్దవాళ్ళు ప్రవర్తించగలిగితే చాలావరకు మనసులు నలగకుండా పెళ్ళిచూపులనుండి పెళ్ళిదాకా ఏ సమస్యలూ లేకుండా సాఫీగా వెళ్ళిపోతుంది.

తృప్తినిండిన పెళ్ళికూతురి మనసు లోపలి అరలలోనుండి వినిపించే సన్నని షెహనాయ్‌స్వనం, మబ్బు అంచులో మెరిసే కాంతిరేఖ; పెళ్ళికూతురి జడలో వెలివిరిసిన మల్లెపూల చిరుదరహాసం, భగవంతుడు ప్రసాదించిన దివ్యవరమైన జీవితం మంచుముత్యాలని, మల్లెలసౌరభాలని మోసుకుని తేనెజల్లుల్ని కురిపించక మానదు. ప్రతియింట్లో తృప్తి తాండవం చేస్తూ ఆయింటిని నందనవనంగా మారుస్తుంది.